వ్యాపారిపై దాడి, కిడ్నాప్

● కొన్ని గంటల్లోనే అడ్డాకులలో పట్టివేత ● ఆర్థిక లావాదేవీలే కారణం?


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్

నార్సింగ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గోల్డ్, ఎలక్ట్రానిక్ వ్యాపారం చేసే వ్యక్తిని ఆర్థిక లావాదేవీల కారణంగా కర్నూల్‌కు చెందిన వారు దాడి చేసి మరీ కిడ్నాప్ చేశారు. నార్సింగ్ పోలీసులు కొన్ని గంటల వ్యవధిలో నిందితులను మహబూబ్‌నగర్ పోలీసుల సహాయంతో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆదివారం సాయంత్రం వెల్లడించారు. హైదర్షాకోట్ పోర్ట్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే శేషువర్ధన్‌రెడ్డి(37) బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారం చేస్తుంటాడు. ఈయనకు కర్నూల్ నందికొట్కూరుకు చెందిన అందె క్రాంతి కుమార్(36), పి.సందీప్(36)తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో శేషువర్ధన్‌రెడ్డి తన బిజినెస్ పార్టనర్ సుష్మితకు చెందిన మారుతీ ఎస్‌క్రాస్ కారు(టీఎస్07హెచ్‌ఏ1221)లో వెళ్తుండగా నార్సింగ్ రోటరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. శేషువర్ధన్‌రెడ్డిపై దాడి చేసి మరో కారులో ఎక్కించుకొని వెళ్తుండగా నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చి కారును తనిఖీ చేస్తుండగా రాత్రి 10 గంటల ప్రాంతంలో శేషువర్ధన్‌రెడ్డి భార్య అరుణకు ఫోన్ వచ్చింది. ఆమె నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిడ్నాపర్లు కారులో శేషువర్ధన్‌రెడ్డిని తీసుకొని కర్నూల్ వైపు వెళ్తున్నట్లు నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మహబూబ్‌నగర్ పోలీసులను అలర్ట్ చేయగా, వారు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టారు. అడ్డాకుల టోల్‌గేట్ వద్ద కిడ్నాపర్లు మహబూబ్‌నగర్ పోలీసులకు చిక్కారు. గతంలో వీరు ఏసీల బిజినెస్ కూడా కలిసి చేశారని పోలీసులు గుర్తించారు. శేషువర్ధన్‌రెడ్డిని సురక్షితంగా అడ్డాకుల పోలీసుల సహాయంతో రక్షించగలిగామని నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్ స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. వ్యాపార లావాదేవీలను న్యాయపరంగా కోర్టు నుంచి పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.

కూచిపూడి రంగప్రవేశం





ప్రముఖ దంత వైద్యులు ఎం.ఎస్ గౌడ్ మనుమరాళ్లు, కీర్తి, వికాస్‌గౌడ్ దంపతుల కూతుళ్లు త్రిఖగౌడ్, మిష్కగౌడ్ ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికగా కూచిపూడి రంగప్రవేశం చేశారు. నృత్య ప్రదర్శన ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. కూచిపూడి నాట్యగురువు జ్యోతిరెడ్డి పర్యవేక్షణలో గౌడ సిస్టర్స్ రంగ ప్రవేశానికి ప్రముఖ సినీనటుడు సుమన్, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, కేవీ రమణాచారి, తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సాయిబాబాగౌడ్, భారతీయం సత్యవాణి, నృత్య విమర్శకుడు జీవీ అన్నారావు తదితరులు హాజరయ్యారు.

తవ్వేశారు.. వదిలేశారు

(1వ పేజీ తరువాయి)

చెల్లించిన అనంతరం రోడ్డు తవ్వేందుకు అనుమతినిస్తారు. పనులు పూర్తయిన అనంతరం జీహెచ్‌ఎంసీ పునరుద్ధరణ పనులు చేపడుతుంది. ఈ విషయంలో వాటర్‌బోర్డుకు మినహాయింపునిచ్చారు. ఇంజనీరింగ్ వ్యవస్థ ఆ విభాగంలో కూడా ఉండడంతో కొద్ది మేర రోడ్డు తవ్వే పనులకు సంబంధించి పునరుద్ధరణ పనులు చేసే బాధ్యత బోర్డుకు అప్పగిస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే, చాలా ప్రాంతాల్లో బోర్డు అధికారులు రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదు. లీకేజీల అరెస్టు, పైపులైన్ల మార్పు కోసం రహదారులు తవ్వి పనులు పూర్తి చేయకుండానే అలాగే వదిలేస్తున్నారు. సకాలంలో పునరుద్ధరణ పనులు చేయని పక్షంలో సంబంధిత అధికారుల నుంచి జీహెచ్‌ఎంసీ వివరణ కోరే అవకాశముంది. అయినా బల్దియా బాధ్యత విస్మరిస్తోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.


మియాపూర్‌లో కంకర తేలిన రోడ్డు

● ఎన్నికల కోడ్ వల్లే : జీహెచ్‌ఎంసీ అధికారి

ఎన్నికల కోడ్ ఉండడం వల్లే పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన నేపథ్యంలో రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారొకరు చెప్పారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టవద్దు.. మరమ్మతు, నిర్వహణ పనులు చేసే అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

నిజాంపేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పేద ఇంజనీరింగ్ విద్యార్థిని చదువు కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2కు చెందిన కృష్ణ సంగీతల కుమార్తె భూమిక ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత సరిగ్గా లేకపోవడంతో కాంగ్రెస్ నాయకుడు నర్సింహయాదవ్‌తో కలిసి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం కలిశారు. భూమిక చదువు కోసం సాయం చేయాలని శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. అందుకు స్పందించిన ఆయన భూమిక ఫీజుకు కావలసిన 50 వేలు రూపాయలు ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన వారు నర్సింహయాదవ్, శ్రీనివాస్, భూమిక తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా..

ఇందిరమ్మ కాలనీ, ఫేజ్-2లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడిన అనంతరం కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



పతకం అందుకుంటున్న లక్ష్మణ్‌రెడ్డి

జాతీయ స్విమ్మింగ్‌లో లక్ష్మణ్‌రెడ్డికి రెండు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ మాస్టర్ గేమ్స్‌లో హైదరాబాద్ వెటరన్ అథ్లెట్, ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి(77) రెండు స్వర్ణ పతకాలు సాధించారు. ఆదివారం గుజరాత్‌లో జరిగిన ఈత పోటీల్లోని 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో 3 నిమిషాల 32 సెకన్లలో రేసును పూర్తి చేసి, అగ్రస్థానం దక్కించుకున్నారు. అలాగే, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో 4 నిమిషాల 16 సెకన్లలో రేసును ముగించిన లక్ష్మణ్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు.

కాంగ్రెస్ చందానగర్ డివిజన్ అధ్యక్షుడి నియామకం

చందానగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చందానగర్ డివిజన్ అధ్యక్షుడిగా చందర్‌రావుయాదవ్, ఉపాధ్యక్షుడిగా పోచయ్య అలాగే శేరిలింగంపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడిగా మహ్మద్‌గౌస్‌ను ఆదివారం నియమించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి, జగదీశ్వర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సునీతాప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రన్నింగ్ బస్ దిగబోతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

హైదర్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణిస్తున్న బస్ లోనుంచి దిగబోయిన ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై పడి మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్ఈఎల్ రామచంద్రపురంలో నివాసం ఉండే రాజశేఖర్‌రెడ్డి(50) కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సొంత పనుల నిమిత్తం కూకట్‌పల్లి ప్రగతినగర్‌కు వెళ్లి తిరిగి వచ్చేక్రమంలో ప్రగతినగర్ నుంచి మెహదీపట్నం ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ వద్దకు రాగానే బస్ రన్నింగ్‌లో ఉండగానే దిగేందుకు ప్రయత్నించాడు. నియంత్రణ కోల్పోయిన రాజశేఖర్‌రెడ్డి రోడ్‌పై పడడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిలాఫలకం వేసి ఏడాది



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లో 100 పడకల సర్కారు దవాఖానా కలగానే మిగులుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది జూన్ 10న అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేసి ఏడాది అవుతున్నా ఎలాంటి పనులూ జరగడం లేదు. ఆనాడు వేసిన శిలాఫలకం విరిగిపోంది. ప్రస్తుతం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఇద్దరూ బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు కావడంతో పనులు ఏ మేరకు సాగుతాయో అర్థం కావడం లేదు.

నగరంతో కిషన్‌రెడ్డి మమేకం

(1వ పేజీ తరువాయి)

రోడ్డు షోలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

అంబర్‌పేటతో అనుబంధం

గంగాపురం కిషన్‌రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రి స్థాయికి ఎదిగినా అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. పూర్వ హిమాయత్‌నగర్‌లో ఒకసారి, పునర్విభజనలో అంబర్‌పేటగా ఏర్పడిన తర్వాత రెండుసార్లు విజయం సాధించారు. తర్వాత ఆయన సికింద్రాబాద్ ఎంపీగా రెండుసార్లు విజయం సాధించారు. రెండుసార్లు అంబర్‌పేట నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ ఓట్లు ఆయనకు దక్కాయి. ఎంపీగా ఆయన విజయం సాధించడంలో ఈ నియోజకవర్గ ప్రజలు ప్రధాన భూమిక పోషించారు. అందుకే కిషన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో అంబర్‌పేటకు అధిక ప్రాధాన్యమిస్తూ కృతజ్ఞతాపూర్వకంగా ఉంటున్నారని స్థానిక పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

నగరాభివృద్ధి బాటలో..

నగర అభివృద్ధిలో కిషన్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన 'రిపోర్ట్ టు ద పీపుల్ ప్రజెంటేషన్' (ప్రజలకు నివేదన)లో స్పష్టం చేశారని నాయకులు చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ. 26,000 కోట్లు కేటాయింపు, మెట్రోకు రూ.1204 కోట్ల నిధులు కేటాయించడంలో కిషన్‌రెడ్డి కృషి ఉందంటున్నారు. వచ్చే ఏడాది నాటికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.715 కోట్లతో పనులు ప్రారంభించిందని చెబుతున్నారు. అలాగే హైదరాబాద్‌లో 1000 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, గోల్కొండ కోటల చరిత్ర తెలిపేలా సౌండ్ అండ్ లైట్ షోలను అందుబాటులోకి తీసుకురావడం కీలకమంటున్నారు. కాచిగూడ, నాంపల్లి, బేగంపేట ఆధునికీకరణ, ఎంఎంటీఎస్ ఫేజ్-11 పనులను పూర్తి, సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్‌సెంటర్లు ద్వారా బస్తీ దవాఖానాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర చాలా ఉందంటున్నారు.

సికింద్రాబాద్‌లో గెలిస్తే... కేంద్రంలో బెర్త్ పక్కా

(1వ పేజీ తరువాయి)

గెలుపొందిన శివశంకర్ 1980లో ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కీలకమైన న్యాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1984లో సికింద్రాబాద్ నుంచి గెలిచిన టంగుటూరి అంజయ్య రాజీవ్‌గాంధీ మంత్రి వర్గంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఇదే పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందిన బండారు దత్తాత్రేయ 1998 నుంచి 1999 వరకు వాజ్‌పేయి మంత్రి వర్గంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా.. 1999 నుంచి 2001 వరకు వాజపేయి మంత్రి వర్గంలో పని చేశారు. 2003లో బండారుకు అర్బన్ డెవలప్‌మెంట్ పోర్ట్ పోలియో ఇచ్చారు. 2014లో నరేంద్ర మోదీ మంత్రి వర్గంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా దత్తాత్రేయ పనిచేశారు. ఆ తర్వాత 2019, 2024లో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నుంచి గెలుపొందారు. 2019లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, ఆ తర్వాత సాంస్కృతిక, పర్యాటక శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. మళ్లీ ఇప్పుడు తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన కిషన్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి లభించింది.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా..: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసం వద్ద కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీవేణి ఎన్‌క్లేవ్, మిథులానగర్, ప్రగతీనగర్, ప్రశాంతిహిల్స్, భగత్‌సింగ్‌నగర్, ఏపీహెచ్‌బీకాలనీ, తెలుగుతల్లినగర్, 60 గజాలు, శ్రీరామ్‌నగర్-ఏ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు తక్షణమే స్పందించి, ప్రణాళికలు రూపొందించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

నేటి నుంచి బాచుపల్లి మండలంలో ప్రజావాణి

దుండిగల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం బాచుపల్లి మండలంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో మండల, డివిజన్ స్థాయి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.


కొలన్ హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న శివానగర్ కాలనీవాసులు

శివానగర్ పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తా..

దుండిగల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ శివానగర్‌కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, కమ్యూనిటీహాల్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి కోరారు. బాచుపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంత్‌రెడ్డి కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్ పనులను ప్రారంభించేలా వారం రోజుల్లో ప్రారంభించేలా చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జావీద్, కోశాధికారి నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధవరావు, సీనియర్ నాయకుడు రత్నేశ్వర్‌రావు, జామన్ బాషా, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు ఉన్నారు.


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు శారీరక శ్రమ అవసరం: గంగిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు శారీరక శ్రమ పడేటట్లు ప్రోత్సహించాలని డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ గంగారెడ్డి అన్నారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో హైదరాబాద్ రన్నర్స్ అవుట్‌డోర్ కిడ్స్ గ్రాడ్యుయేషన్ సెర్మనీ 2024 ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు అభిజీత్ మద్నూర్కర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై నాలుగు కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ పరుగులో 11 నుంచి 14 ఏళ్లు, 8 నుంచి 10 ఏళ్లు, 6 నుంచి 8 ఏళ్ల వయస్సు గల పిల్లలు పరుగు పందెంలో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లల్లో ఉత్తేజాన్ని పెంచుతాయని గంగారెడ్డి అన్నారు. ఈ పరుగులో పాల్గొన్న 11 వందల మంది చిన్నారులు ఏప్రిల్ 15 నుంచి నేటి వరకు వివిధ ప్రాంతాల్లో అవుట్ డోర్ కిడ్స్ ద్వారా శిక్షణ పొందారని తెలిపారు. కీర్తి సోషల్ ఇనిస్టిట్యూషన్స్ సహకారంతో ఎన్‌బీటీ షేక్‌పేట్, ఎంజీఎన్ బంజారాహిల్స్, జీపీటీవి ప్రభుత్వ పాఠశాలల పిల్లలుఉన్నారు.

డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో బడిబాట



అవగాహన కల్పిస్తున్న సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ, జేఎన్‌టీయూ విద్యార్థులు

మియాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సభ్యులు, హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ విద్యార్థులు కలిసి మియాపూర్ ప్రాంతంలో బడీడు పిల్లలను బడిలో చేర్పుకోవాలని కోరుతూ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇం టింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి చదువు ప్రాముఖ్యతను వివరించారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లల విద్య అవగాహన కోసం శ్రమిస్తోందని సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్, ఏఐజీ హాస్పిటల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం

పేట్‌బషీరాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొంపల్లి నుంచి బొల్లారం వెళ్లే ప్రాంతంలో ఉంది. 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించారు. అతడి గురించి ఎవరికీ తెలియగురించి ఆరా తీయగా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తంగా గాంధీ ఆస్పత్రికి తరలించారు.

తండ్రి మందలించాడని బాలిక అదృశ్యం


వసంత

మియాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోమని తండ్రి మందలించినందుకు ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నడిగడ్డతండాకు చెందిన భానోత్ నరేష్ ఈనెల 7న తన కూతురు వసంతను చదువుకోమని గట్టిగా మందలించాడు. అనంతరం పని కోసం తల్లిదండ్రులు బయటకు వెళ్లాడు. నరేష్ భార్య పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిచూడగా కూతురు ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించారు. ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబసభ్యులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలి'

హైదరాబాద్ సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తాండూరు ఎమ్మె ల్యే, తెలంగాణ రాష్ట్ర హోమ్ గార్డ్స్ చైర్మన్ బయ్యని మనోహర్‌రెడ్డిని ఆదివారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో కలిసి వినతిప్రతం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్వాల్ దయానంద్, ఉపాధ్యక్షులు అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ చాంద్ పాషా పేర్కొన్నారు. ఆదివారం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ పుట్టిన రోజు కావడంతో ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

గ్రేటర్ విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం

● స్కాడా పరిధిలోని లైన్స్‌విభాగం ఆపరేషన్ విభాగం పరిధిలోకి..

● రెండు, మూడు రోజుల్లో తుది నివేదిక

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. మెట్రోజోన్ పరిధిలో విద్యుత్‌లైన్ల విభాగాన్ని ఆపరేషన్ వింగ్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా డిస్కం కసరత్తు ప్రారంభించింది. గ్రేటర్‌జోన్‌లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటూ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డిస్కం ఓ కమిటీని నియమించింది. ప్రస్తుతం స్కాడా ఎస్‌ఈ పరిధిలో పనిచేస్తున్న లైన్స్ విభాగం డీఈలు ఆపరేషన్స్ ఎస్ఈల పరిధిలోకి తీసుకువచ్చే దిశగా కమిటీ ప్రాథమికంగా సూచించింది. ఇద్దరు సీజీఎంలు, ముగ్గురు ఎస్ఈలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీకి ఇప్పటికే ఓ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన సీఎండీ కమిటీకి పలు సూచనలు చేయడంతో పాటు తుది నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో మెట్రోజోన్‌లో చేపట్టబోయే మార్పులు, జోన్లు, సర్కిళ్ల పునర్విభజనపై పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కొత్తగా బస్ రూట్లు.. నెలవారీ పాస్‌లు.!

● ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు

● టీజీఎస్ ఆర్టీసీగా బస్‌పాస్ వెబ్‌సైట్ మార్పు



హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కొత్త బస్‌రూట్లు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆదాయం పెంచుకునేందుకు ఏసీ బస్సుల్లో రూట్ బస్‌పాస్‌లు, చార్జీలు తగ్గించి నెల వారీ పాస్‌లను గ్రేటర్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఏసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెంచి అదనపు ఆదాయం తెచ్చేకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా పుష్పక్ ఏసీ బస్సుల్లో మొదటిసారిగా రూట్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. శంషాబాద్-ఎయిర్‌పోర్ట్‌లో శంషాబాద్, ఆరాంఘర్, బాలాపూర్, గచ్చిబౌలి నుంచి రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు ప్రయాణించేవారి కోసం రూట్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చారు. అదే తరహాలో గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో రూ. 1,900కే నెల వారీ బస్‌పాస్ ప్రవేశపెట్టారు. ఈ పాస్ ధర మే వరకు రూ.2,530 ఉండగా రూ.630 తగ్గించి బస్‌పాస్‌ల సంఖ్య పెంచే దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. విద్యార్థుల బస్‌పాస్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేసే http://mis.tsrtcpass.in అనే వెబ్‌సైట్ కూడా http://mis.tgsrtcpass.comగా మార్చినట్లు గ్రేటర్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

రామోజీరావుకు పీఆర్ఎస్ఐ సంతాపం

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల పాటు అప్రతిహతంగా నాణ్యమైన సమాచారం ప్రసారం చేసిన మీడియా దిగ్గజం చెరుకూరి రామోజీరావు మృతికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఆర్ఎస్ఐ చైర్మన్ ఎస్.రాము మాట్లాడుతూ ఆధునిక జర్నలిజంలో ఎన్నో మార్పులకు రామోజీరావు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యదర్శి కంభంపాటి యాదగిరి మాట్లాడుతూ రామోజీ తెలుగు జాతికి చేసిన సేవలు మరువలేమని పేర్కొన్నారు. వాకిటి మధు, శ్రీనివాసరావు, కృష్ణ బాజీ, రాజేష్, మోహన్‌రావు, సుబ్బారావు తదితరులు రామోజీరావుతో సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.


పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో దోపిడీ

● రూ. 14.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

● లింక్‌లు పంపి లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే చాలంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన మహిళ నుంచి రూ. 14.5 లక్షలు దోచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన మహిళకు ఇటీవల టెలిగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. కేవలం గూగుల్ మ్యాప్‌లో మేం సూచించిన రెస్టారెంట్‌లను సబ్‌స్క్రైబ్, లైక్ చేస్తే చాలు.. డబ్బులు మీ ఖాతాలో వేస్తాం, పార్ట్‌టైమ్ జాబ్ చేసి డబ్బులు సంపాదించాలి అనుకునేవారు కింద ఇచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి, రిజిస్టర్ కావచ్చు అంటూ రాసి ఉంది. నిజమని నమ్మిన ఆమె వెంటనే లింక్‌ను క్లిక్ చేసింది. ఆ తర్వాత వారు చెప్పిన విధంగానే గూగుల్ మ్యాప్స్‌లో రెస్టారెంట్లకు లైక్‌లు కొట్టడం, రేటింగ్ ఇవ్వడం, వారు చెప్పిన యూట్యూబ్ చానల్స్ వీడియోలను చూసి సబ్‌స్క్రైబ్ చేశారు. అందుకు వారు ఆమె ఖాతాలో డబ్బులు వేశారు. ఇలా కొన్నిరోజులు నమ్మించిన నేరగాళ్లు ఆ తర్వాత మీరు ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఆ డబ్బుతో తక్కువ సమయంలోనే అధిక లాభాలు సంపాదించవచ్చు అంటూ నమ్మించారు. పెద్ద మొత్తంలో లాభాలు వస్తున్నట్లు వర్చువల్‌గా చూపించారు. కానీ, డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. అప్పటికే బాధిత మహిళ రూ. 14.5 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేసింది. అనుమానం వచ్చిన ఆమె సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధిదీపాలు పగలూ వెలుతున్నయ్


పగలు వెలుగుతున్న స్ట్రీట్‌లైట్

గచ్చిబౌలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో వీధి దీపాలు 24 గంటలు వెలుగుతూనే ఉంటున్నాయి. వాటినిఆఫ్ చేయడం లేదు. దీంతో విద్యుత్, ప్రజాధనం వృధా అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్కిల్ పరిధిలోని పాపిరెడ్డికాలనీ, లింగంపల్లి ఇతర ప్రాంతాల్లో వీధిదీపాలు 24 గంటలూ వెలుతున్నాయని స్థానికులు తెలిపారు.